# రక్తయజ్ఞం

●

లత వృక్షాన్ని ఆశ్రయిస్తుంది. స్త్రీ పురుషుని ఆశ్రయిస్తుంది. ఇది ప్రకృతి సహజం. కాని ఈ లత సామాన్య మైనదికాదు- హేమలత! ఆశ్రయం అక్కరలేదు. ఇవ్వగలదు. ప్రకృతి ధర్మం తలక్రిందులు కాగా ఆశ్రయం సంపాదించుకొన్న ఆ పురుషుడే శ్రీపతి ... ప్రాణమిత్రునికి ప్రమా దంగా వున్నదని తంతివార్త వస్తే ఆనందించడూ మరి!

**ఈ** కథ ముగిసేనాటికి—ఒక్క సంవత్సరం క్రితం హేమలత జబ్బుకు లోనైంది. రోగం విషమించింది. ఆమెకు రక్తసహాయం కావాలన్నాడు వైద్యుడు. ఆ రక్తాన్ని సమర్పణ చేసినవాడు—శ్రీపతి. ఆ సంఘటన తరువాత అతడు కొన్నాళ్ళవరకు నీరసించిపోయాడు... పాపం... అతని నుదుటివ్రాత!

పై సంఘటనకూ, ఇక చదువబోయే కథకూ గల సంబంధమేమిటీ?... ...

* * *

నాలుగు రోజులుగా ఎదురుచూస్తున్న టెలిగ్రాం రానే వచ్చింది. "శ్రీపతి, కేరాఫ్ హేమలత" అంటూ, టెలిగ్రాం అందజేసి తపాలా బంట్రోతు వెళ్ళిపోయాడు.

లత వృక్షాన్ని ఆశ్రయిస్తుంది. స్త్రీ పురుషుణ్ణి ఆశ్రయిస్తుంది. ఇది ప్రకృతి సహజం. కానీ—యీ లత సామాన్యమైన లతగాదు. హేమలత! దీనికి ఆశ్రయం అనవసరం. మరొకరికి తాను ఆశ్రయం యివ్వగలదు కూడా. ఆ ఆశ్రయాన్ని సంపాదించుకొన్న వృక్షమే శ్రీపతి. అందుకే—అతనికి తంతి హేమలత చిరునామాకు వచ్చింది.

కృష్ణమూర్తి అతని ఆప్త మిత్రులలో ఒకడు. అతన్ని రెండేళ్ళక్రిందట—అంటే తన వివాహసమయంలో తుదిసారిగా చూశాడు శ్రీపతి. అంతే! ఆ తర్వాత ఉత్తరాలద్వారా యోగక్షేమాలు విచారించుకోవడమేగానీ,

ముఖాముఖిగా సంభాషించుకోవడం యింతవరకూ సంభవించనేలేదు. అతనికీ, తనకూ మధ్యదూరం నలభై మైళ్ళు!

"కృష్ణమూర్తికి చాలా ప్రమాదంగా వుంది. తక్షణమే బయలుదేరి రావలసింది!" ఇదే తంతివార్త. శ్రీపతి హృదయసాగరంలో పొంగి పొరలి, ఉవ్వెత్తున పైకిలేచినవి దుఃఖపు కెరటాలుగావు; సంతోష తరంగాలు!

వారంరోజులక్రితం శ్రీపతి కృష్ణమూర్తికి ఒక లేఖ వ్రాశాడు. "కృష్ణమూర్తీ! రెండు సంవత్సరాల అనుభవం ద్వారా గ్రహించిన సత్యమేమిటంటే—పురుషుడన్నవాడు షష్టిపూర్తి జేసుకున్న తర్వాతగానీ వివాహమాడరాదు. అంతటి నిగ్రహం అసాధ్యమైతే—అందమూ, అతిశయమూ, విత్తమూ, విలాసమూ—వీటిలో ఏ ఒక్క లక్షణంకూడా లేని కన్యను చేసుకోవడం శ్రేయస్కరం. పైచెప్పిన గుణాలన్నీ సతీత్వానికి వేరుపురుగుల్లాంటివి. ఇప్పుడేమనుకుని ఏం లాభం? నదీతీర మైదానాల్లో హాయిగా విహరించే రామచిలుకను పట్టితెచ్చి బంగారు పంజరంలో బంధించినట్లుంది నాపని. ఇంతవరకూ స్వేచ్ఛఅంటే ఏమిటో నేనెరుగను. పెండ్లిఅయిన తర్వాత ఆ స్వేచ్ఛ నాకు దూరమైంది కనుక—దాని విలువ నాకిప్పుడు బహుబాగా అర్థమైంది. ఈ జీవితంలో నాకు ఒక్కరోజు స్వేచ్ఛకావాలి. ఇది నా చిరకాల వాంఛ! నాకున్న ఆప్తుల్ని లెక్కబెట్టుకోవాలంటే - ఒక చేతిలోని వ్రేళ్ళుకూడా ఎక్కువే. అటువంటివారిలో నువ్వొకడివి. ఈ విషయం మా ఆవిడకు బాగా తెలుసు. కనుక యీ సమయంలో నాకు నీ సహాయం

కావాలి. నీకు ప్రమాదంగావుందని టెలిగ్రాం యిప్పించు. ఒక్కరోజు స్వేచ్ఛావిహారానికి అనుమతి లభించగలదు..." అంటూ అభ్యర్థించాడు శ్రీపతి.

అసలు శ్రీపతి వివాహం బహు విచిత్రంగా జరిగింది. అతడు ఆమెను ప్రేమించలేదు. ఆమెతో పరిచయం లేదు. ఆ మలుపును అతడు ఊహించనైనా లేడు...

అతని మామగారు వేంకట నరసింహం చౌదరిగారు. వారు కంటికి రెప్పగా కాపాడుకుంటూ వచ్చినవి—రెండు: ఒకటి—హేమలతా నామధేయురాలైన నిజతనయ; రెండు: జగత్పావనియైన క్షీరసాగర తనయ. ఆ యిద్దరు తనయులలో ఏ ఒక్కరినిగూడా ఎడబాసి వుండలేరు వేంకట నరసింహంచౌదరిగారు. అందుచేతనే—అతనికంటికి—అన్ని రత్నాలలోకీ శ్రీపతి అనేరత్నం శ్రేష్ఠమయినదిగా తోచింది. అతని మనస్సుకు నచ్చిన లక్షణాలు, గుణాలు శ్రీపతిలో మెండుగా కనిపించాయి. అతడు అందగాడు, విద్యావంతుడు, వినయశీలుడు. లేమిగలవాడు. జన్మసంబంధమైన ఋణానుబంధం త్రెంచుకొన్నవాడు. అన్నిటికీమించి, అతనికి ఎక్కువమార్కులు సంపాదించిపెట్టిన దొడ్డగుణం — ఆజన్మాంతమూ, హేమలత ఆలంబనంగా, తానొక చిరుతీగగా తన బ్రతుకుతీగను కొనసాగించడానికి అంగీకరించడం.

...అందరూ అతన్ని అదృష్టవంతుడన్నారు. తొలుదొలుత తనకూ అలాగే అనిపించింది. కానీ, కళ్ళెంలేని కాలం తనకు నిజాన్ని ఎరుకపరచింది,...తనకన్నా దురదృష్టవంతుడు మరొకడుండడు!

ఆ యింట్లో తన పాత్ర ఎటువంటిదో తనయొక్క ప్రాముఖ్యం ఏమిటో శ్రీపతికి బోధపడ లేదు. బాల్యంలో హేమలతకు బొమ్మలంటే తగని ప్రేమట. బాల్యం అంత రించగానే ఆమెకు ఆ బొమ్మలు పనికిరాకపోయాయి. మరో క్రొత్తబొమ్మ కావలసి వచ్చినది. తానే ఆ బొమ్మ.

తన మామగారు ఒక కుక్కను పెంచేవారు. దానిది కూడా మంచిపేరే—తనపేరులాగా. భైరవి! వేంకట నర సింహం చౌదరిగారు దాన్ని కవ్విస్తూ చిటికలు వేసేవారు. అది తోకాడిస్తూ అతని చేతిని మూజూసేది. ఆయనదృష్టిలో తానుకూడా అంతే!

మానవ మాత్రులనైతే శాసించగలిగాడు గానీ - అతడు విధినిమాత్రం శాసించ లేకపోయాడు. తన యిద్దరు సుతలను తప్పనిసరిగా ఎడబాయవలసి వచ్చింది. అది శాశ్వతమైన ఎడబాటు.

అతన్నిజూచి చాలామంది అసూయ పడ్డారు. "అదృష్టం అందర్నీ ఎలావరిస్తుందీ?" అన్నారు ఆ అసూయ పడ్డవాళ్లే. శ్రీపతికూడా అదే అనుకుని నిట్టూర్చాడు... ప్రపంచంలోని వారందరూ అదృష్టవంతులనీ, తానొక్కడే దురదృష్టవంతుడనీ అతని విశ్వాసం. తనలో దాగిన అసం తృప్తి లోకానికేం తెలుసు ?... తాను అస్వతంత్రుడు. ప్రత్యేకించి ఏపని చేయటానికి అధికారం లేనివాడు—తనకు అభిప్రాయాలుగానీ, ఆంతరంగిక విషయాలుగానీ వుండ రాదు. పైవారియిష్టమే తన యిష్టం. వారి ఆనందమే తన

ఆనందం. వారి జీవితమే తన జీవితం. వారికోసమే తాను. సతికోసమే పతి!

తనకు స్వేచ్ఛలేదు. బడిపిల్లవాడిలా ప్రతిగంటకూ హాజరు వేయించుకోవాలి. నియమం తప్పిన పక్షంలోగానీ ఆనతి అతిక్రమించిన పక్షంలోగానీ—తనకు లభించేశిక్ష వర్ణనాతీతం!... మూతిముడుపులు, రుసరుసలు, ఎత్తిపొడుపులు, మూగనోములు—ఈ శిక్షలన్నీ అధికారిణి హేమలతా దేవి స్వయముగా విధిస్తుంది.

హేమలత అంటే తనకెంత భయభక్తులో ఒకరిద్దరు నౌకర్లపట్లగూడా అంతటి భయభక్తులు లేకపోలేదు శ్రీపతికి. వారికి అమ్మగారి అనుగ్రహం వున్నది. ఒకసారి పొరుగింటి బుచ్చమ్మ తనను చూచి నవ్విన చిరునవ్వు నౌకరు వెంకన్న కంటబడింది. వాడు ఒక వారం రోజులపొడుగునా అమ్మగారి పేరెత్తి తనను హడలుగొట్టి, తనవద్ద ఐదురూపాయలు దాకా వసూలుజేశాడు.

గొప్పవారి నిగ్రహం ఎంత దుర్భరమో వారి అనుగ్రహం కూడా అంతే దుర్భరం. కొన్ని శృంగారఘట్టాల్లో హేమలత తనపట్ల ఎనలేని అనురాగం చూపుతుంది. ఆ స్వారస్యంలో తనకు చెంపలైనా తూట్లు పడిపోవచ్చు; పెదవులైనా గాట్లు పడిపోవచ్చు.

ఏది ఎలావున్నా స్వేచ్ఛలేని ఆ జీవితం దుస్సహం అనిపించిందతనికి. ఒక హోటలులేదు, సినిమాలేదు, పార్కులేదు, గ్రంథాలయం లేదు, క్లబ్బులేదు, యమునా తటమున శ్యామసుందరునిలా విహరించడానికి గోపికాబృందం

లేదు. తనకు ఒక్కరోజు ఆటవిడుపు కావాలి. కృష్ణమూర్తి ధర్మాన తప్పకుండా ఒక్కరోజైనా సెలవు మంజూరు కాగలదు.

చిన్ననాటి రంగస్థలానుభవం యీనాడు శ్రీపతికి ఎంతో ఉపకరించింది. అతని విచారవదనాన్ని చూచి, హేమలత ఎదురాడలేదు—"వెళ్ళిరండి! ఇప్పుడు బస్సు అందవచ్చు. రాత్రికి అక్కడ ఆగవద్దు. సాయంకాలం ఆరు కాగానే రెక్కలు గట్టుకుని యిక్కడ వాలాలి. ఇది ఖర్చుల కుంచుకోండి!..."

* * *

శ్రీపతి బయలుదేరాడు. తన దాంపత్యజీవితంలో— ప్రక్కన భార్యలేకుండా ప్రయాణంచేయడం ఇది ప్రథమ పర్యాయం అతనికి. పంజరంలోనుంచి విడిచిపెట్టిన పావురాల్లా అతని ఆలోచనలు ఎక్కడెక్కడికో పయనిస్తున్నాయి. గమ్యస్థలం దర్శనమివ్వడం మాత్రమే అతనికి తెలుసు.

ఇంటినంబరు ఆధారంగా కృష్ణమూర్తి నివాసంఉన్న గృహం చేరుకున్నాడు శ్రీపతి. అక్కడ అతనికి నిరాశ సాక్షాత్కరించింది. కృష్ణమూర్తికి మారుగా తాళం వేయబడి వున్న ఆ యింటితలుపు అతన్ని పలుకరించింది. ఆ తలుపుపైన ఒక చీటీ అతికింపబడివుంది. అందులో కృష్ణమూర్తి దస్తూరీ... "శ్రీపతీ! సరిగ్గా నీకు టెలిగ్రాం యిచ్చిన పావుగంటకు నాకు ఒక టెలిగ్రాం రావడంచేత సమయానికి నీకు స్వాగతం యివ్వలేక పోతున్నాను. అయినా ఫరవా

లేదు. సాయంకాలం అయిదుగంటలకు కలుసుకుందాము -
నీ కృష్ణమూర్తి."

"హా కృష్ణా! నీ లీల లెన్నతరమా!" అంటూ విధితో మొరబెట్టుకున్నాడు శ్రీపతి. సూర్యుడు నెత్తి మాడ్చుతూంటే, ఆకలి కడుపు మాడ్చుతోంది. రూపాయ ఖర్చుతో క్షుద్బాధను తుదముట్టించి, ఒకవీధివెంట నడక సాగించాడు. రెండేళ్ళల్లో ఊరు చాలా మారిపోయిందని పించింది. శ్రీపతి సందేహంగా ఒకయింటిముందు ఆగాడు. సందేహంలేదు. అమృతవల్లి యిల్లు యిదే! ఆ మధుర నామస్మరణ అతన్ని పులకాంకితుణ్ణి జేసింది. "అమృతవల్లీ" అని ఎలుగెత్తి పిలవాలనిపించింది. ఒక్క ఉదుటున లోపలికి వెళ్ళి, ఆమె ఒడిలో వాలిపోవాలనిపించింది. ఇంటిముందు వ్రేలాడుతోన్న సైన్ బోర్డు అతన్ని వారించింది—"షేక్ అబ్దుల్ గఫూర్, చర్మముల వ్యాపారము."

శ్రీపతి పార్కులోకి నడిచాడు. పొగడచెట్టునీడలో బెంచీపైన కూర్చున్నాడు. స్వేచ్ఛావాయువులు హాయిగా వీస్తున్నాయి. అతనికి బ్రతుకొక ఎడారిలా, ఆ వూరు ఒక ఒయాసిస్సులా, ఆదినం ఆ ఒయాసిస్సుదగ్గర మజిలీలా అని పించింది. ఒక్కరోజు! ఈ ఒక్కరోజు—తాను మానస సరోవరంలోని హంస. ఈ వూళ్ళో సినిమా థియేటరుంది. పార్కువుంది. హోటళ్ళున్నాయి. క్లబ్బులున్నాయి. గ్రంథాలయాలున్నాయి. జాతి విచక్షణలేకుండా స్నేహితు లున్నారు. ఈరోజు యివన్నీ తనవి.

2)

అతడు అలాగే అదమాయించి నిద్రపోయాడు. మునిసిపాలిటీ సైరను హేమలత గొంతులా గీపెట్టడంతో ఉలికిపడి లేచాడు. ముంజేతి గడియారం చూచుకున్నాడు. సైరన్‌ను నమ్మాలో, లేక తన గడియారాన్ని నమ్మాలో అతనికి తెలియలేదు. గంట అయిదున్నరైంది. కృష్ణమూర్తి యింటి కేసి నడిచాడు.

కృష్ణమూర్తి యింటి తలుపు తెరిచివుంది. లోపల — ఆకుదోట నిచ్చెనలా పొడవుగానూ, బక్కపలచగానూ వున్న ఓ మనిషి వాలుకుర్చీలో కూర్చునివున్నాడు. శ్రీపతి—చటుక్కున లోపలికెళ్ళినవాడు అతన్నిచూచి తటపటాయిస్తూ నిలబడ్డాడు. "కృష్ణమూర్తి వున్నాడాండీ?..."

వాలుకుర్చీలో కూర్చున్నవ్యక్తి శ్రీపతి ప్రశ్నవిని విషాదంగా నవ్వాడు—"రావోయి శ్రీపతి! నేనే కృష్ణమూర్తినని చెప్పుకోడానికి సిగ్గుపడుతున్నా..."

"ఏమి టేమిటీ? కృష్ణమూర్తివా!" శ్రీపతి ఆశ్చర్యాన్ని కుంచతో చిత్రించవలసిందేగాని మాటలతో వర్ణించడం దుస్తరం. కృష్ణమూర్తిని బాల్యంనుంచి ఎరుగును తాను. కృష్ణమూర్తి మొదట ఈనపుల్లలావుండేవాడు. పెళ్ళయినపిదప ఏనుగుపిల్లలా పోలికే లేకుండా లావెక్కిపోయాడు. కానీ, యిప్పుడు ఆ కృష్ణమూర్తి చిన్ననాటి కృష్ణమూర్తిగా కనిపిస్తున్నాడు.

"ఎందుకలా చిక్కిపోయావు?" అన్నాడు శ్రీపతి, యింకా ఆశ్చర్యంలోంచి తేరుకోక.

"అందుకు కారణాలు రెండు. నేను పచ్చి సంసారిని కావడం మొదటిది. నారక్తం చాలా రుచికరమైనది కావటం రెండోది" అన్నాడు కృష్ణమూర్తి.

శ్రీపతి కుర్చీని అలంకరించాడు. "అది పోనీ, కృష్ణమూర్తీ! నీకు ప్రమాదంగా వున్నదని ఒక చిన్న అబద్ధమాడి నాకొకరోజు సెలవు యిప్పించావు. నీమేలు జన్మలో మరచిపోలేను. అయినా-నాకు టెలిగ్రాంయిచ్చి, నువ్వెక్కడికి మటుమాయ మయ్యావు?..."

"శ్రీపతీ! అసత్యావచనం మాయింటా వంటా లేదు. నేనెప్పుడూ సత్యమే పలుకుతాను. నేను పరిహాసానికి అసత్యం పలికినా, అది సత్యమే అయితీరుతుంది. నీకు టెలిగ్రా మిచ్చానా, మా ఆవిడకు ప్రమాదంగావున్నదనీ, ప్రసవం కష్టంగావుందనీ, వెంటనే రమ్మనీ సమీపంలోఉన్న మా అత్తవారి వారునుంచి టెలిగ్రాం వచ్చింది. అందుచేత పరుగున వెళ్ళక తప్పలేదు."

"అంతపనే? తరువాతేం జరిగింది?" అన్నాడు శ్రీపతి ఆత్రుతగా.

"మరేం భయంలేదులే! నాకీ చేతిలో ఒక్కమనువు, ఒక్క డజనుసంతానం రాసిపెట్టింది. కనుక గండం గడిచి పిండం బయటపడింది. ఆడపిల్ల!..." అన్నాడు కృష్ణమూర్తి దిగులుగా.

శ్రీపతి సంతోషాన్ని వెలిబుచ్చుతూ అతని చేతులు అందుకున్నాడు. "ఓ హో హో! ధన్యుడివి! తండ్రివైనావన్నమాట! నీకు నా హృదయపూర్వక అభివందనలు..."

"చాలేవోయ్! నాకు వివాహమై ఆరుసంవత్సరాలే అయినా—నేనిప్పుడు నలుగురు ఆడపిల్లల తండ్రినని నీకింకా తెలియదల్లే వుంది. తల్లిపాలకోసం మా యింట్లో అక్క చెల్లెళ్ళు కీచులాడుకోని నిమిషం లేదు..."

శ్రీపతి అర్థమైనట్లు తలపంకించాడు. "ఓహో! అర్థమైంది. నువ్వు చిక్కిపోవడానికి మొదటి కారణం యిదన్న మాట. మరి, ఆ రెండో కారణంకూడా చెప్పేసేయ్..."

"అదేమిటో రాత్రికి నీకే తెలుస్తుందిలే!" అన్నాడు కృష్ణమూర్తి.

తనగోడు కొంత చెప్పుకోవాలనిపించి, శ్రీపతి ప్రారంభించాడు... "కృష్ణమూర్తీ! నువ్వు బి. ఇ. డి. చదువుకున్నందుకూ, మేష్టరు గిరీ వెలగబెడుతున్నందుకూ సానుభూతి చూపించడం న్యాయమేగానీ, ఒకందుకు నిన్ను చూస్తే నాకు అసూయగావుంది. నీవు నీ సంసారాన్ని పోషిస్తున్నావు. నీభార్య నీమాట వింటుంది. నీకు సర్వస్వాతంత్ర్యాలూ వున్నాయి. కానీ, నా పరిస్థితి ఏమని చెప్పుకోను?...బుద్ధి గడ్డితిన్నది. అమృతవల్లి నాకోసం ఎంత పరితపించిందీ తన నృత్యమంతా నాకోసమే వినియోగిస్తాననీ, తన జీవితకుసుమాన్ని నా పాదపూజకే సమర్పించుకుంటాననీ, తనకు దూరంగా వెళ్ళిపోవద్దనీ ఎన్నివిధాలుగా బ్రతిమాలుకొంది! నా దురాశే నన్ను చెరిపింది. నాకా నృత్యం చేతకాదు. అయితే మాత్రమేం? నువ్వు నమ్మితే నమ్ము, నమ్మకపోతే పోమ్మా. ఇప్పుడు నాలోని కీలు కీలూ, అణువణువూ అమృతవల్లి నృత్యానికేమాత్రం

తీసిపోకుండా కదిలిపోతున్నాయి. ఇక ఈ జన్మలో ఈ బాని సకు విముక్తి లేదు. అయితే కృష్ణమూర్తీ! అమృతవల్లి యిప్పుడేమైంది? ఎక్కడుంది?"

"నీవు లేకపోతే నీ అమృతవల్లి బ్రహ్మచారిణిగానే వుండిపోతుందనుకున్నావా? ఆమె పరిణయం చేసుకుని, కన్నవారిని వెంటబెట్టుకుని మగడి యింటికి వెళ్ళిపోయింది. అంతటితో ఆ కథ సమాప్తం!"

"నేనెంత పనిచేశాను! నా జీవితంలో ఎంతటి అసంతృప్తిని రెచ్చగొట్టుకున్నాను!" అన్నాడు శ్రీపతి భగ్న హృదయునికిమల్లే.

"అయినా—నీకు వచ్చిన లోటేముందోయ్ శ్రీపతీ! నీ నామాన్ని సార్థకం చేసుకున్నావు. నీవుచేసింది మంచి పనే! కాలానుగుణంగా నడచుకొన్నావు. డబ్బు ప్రధానమైనది. చెరువులో నీళ్ళుంటేనే కప్పలు. గూటిలో బెల్లముంటేనే చీమలు. ఊళ్ళో సినిమాథియేటర్లుంటేనే నల్లులు. అదేవిధంగా—"

"సినిమా థియేటరంటే జ్ఞాపకంవచ్చింది. ఎన్నాళ్ళకెన్నాళ్ళ కింతటి అదృష్టం! ప్రస్తుతం ఏం సినిమా ఆడుతోంది ఈ ఊళ్ళో?..." అంటూ శ్రీపతి గడియారం చూచుకుని ఎగిరిపడ్డాడు. గడియారపు ముళ్ళు దొంగతనంగా ఆరు దాటేశాయి. తన శ్రీమతి ఆజ్ఞప్రకారం రెక్కలు గట్టుకుని ఎగిరివుంటే—తానిపుడు ఆవిడ సాన్నిధ్యంలో వాలి వుండాలి...

అయినా—చేతికందిన అవకాశాన్ని జారవిడుచుకో దలచుకోలేదు శ్రీపతి. ఈరాత్రికి తాను యిక్కడే ఆగి పోవాలి. హాయిగా సినిమా చూడాలి. తెల్లవారిన తర్వాత వెళ్ళవచ్చు. బస్సుతప్పిపోయిందని సంజాయిషీ చెప్పుకో వచ్చు. అలాకాకుంటే—ఏవిధవో, లేదా ఒంటిబ్రాహ్మడో ఎదురొచ్చాడని చెప్పి తప్పించుకోవచ్చు.

"కృష్ణమూర్తీ! ఈరాత్రి సినిమా చూడకపోతే నేనీవూరు వచ్చినందుకు సార్థకత వుండదు. బయల్దేరు దామా?"

కృష్ణమూర్తి లేచాడు. ఇద్దరూ ముఖాలు కడుక్కు న్నారు. తలుపు తాళంవేసి బయలుదేరారు. హోటలులో భోజనం ముగించి, సినిమాహాలు చేరుకున్నారు.

* * *

కథ ముందుకు పరుగెడుతోంది. రీళ్ళు తిరిగిపోతు న్నాయి. ఒళ్ళంతా సూదులు గ్రుచ్చుకుంటున్నట్టుంది శ్రీపతికి. అటూయిటూ కదలడం మొదలెట్టాడు. అతని బాధ అతను కూర్చున్న కుర్చీకే తెలుసు. తెరమీద కథా నాయకు డేదో చెబుతున్నాడు. అది శ్రీపతికి వినిపించ లేదు. కృష్ణమూర్తి మాటలుమాత్రం వినిపిస్తున్నాయి. "ఈ సువిశాల భారతదేశంలో కరువుఅనేది మనుష్యులకేగాని సల్లులకు గాదు. ఈదేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గవచ్చుకాని, సంతానోత్పత్తి ఎందుకు తగ్గుతుంది?..."

సినిమా ముగిసింది. బయటికి వస్తూ "సినిమా ఎలా వుంది—బాగుందా?" అన్నాడు కృష్ణమూర్తి. "ఏమో,

నేను చూడలేదు. నల్లులు నన్ను చూడనివ్వలేదు"
అన్నాడు శ్రీపతి.

ఇల్లు చేరుకున్నారు. శ్రీపతికి హాయిగా నిద్రముంచుకు వస్తోంది. కృష్ణమూర్తి లైటు వేశాడు. శ్రీపతి దృష్టి చుట్టూ గోడలమీదికి ప్రసరించింది. ఇంతవరకూ తానా విషయం గమనించనేలేదు. గోడలనిండా నల్లటిమరకలు. "ఒరే కృష్ణమూర్తి! టిక్కెట్టు కొనవలసిన అవసరం లేకనే సినిమా చూపిస్తావు గాబోలు—ఈ రాత్రికి..." అంటూ ఆవలించాడు శ్రీపతి. ఇద్దరూ మేనువాల్చారు. కృష్ణమూర్తి తీస్తోన్న కూనిరాగం సన్నసన్నగా వినిపిస్తోంది శ్రీపతికి. అతనికి నిద్రవస్తోంది. కాని అతడున్నది నిద్రావస్థలో కాదు. జాగ్రదవస్థకూడా కాదు. రెంటికీమధ్య ఊగిసలాడుతున్నాడు. అతడున్నట్టుండి లేచి కూర్చున్నాడు. లైటు వెలుగుతోంది. కృష్ణమూర్తి లేచికూర్చుని, తనపైకి దండయాత్ర సాగించిన నల్లులదండును "పునర్జన్మ లేకుండుగాక" అనే మంత్రోచ్చారణతో ఎదుర్కొంటున్నాడు. నల్లుల వాసన గుప్పుగుప్పున వ్యాపించింది. శ్రీపతి ముక్కు మూసుకున్నాడు. "అబ్బా! ధ్వనికన్నా వేగంగా వ్యాపిస్తోందేమిట్రా యీ నల్లుల వాసన? వుండు—నేనూ నీయండ నిలుస్తాను..."

నల్లుల వేట కొనసాగుతోంది. ఆవలింతలు అధికమౌతున్నాయి. నిద్ర భరించశక్యంగాకుండా వుంది. నల్లులు నిద్రపోనీయటం లేదు. శ్రీపతి పడుకున్నాడు. అంపశయ్యమీద పడుకున్నట్టుంది. చివాలున లేచి కూర్చున్నాడు.

"అబ్బబ్బ! ఎందుకో మా ఆవిడ జ్ఞాపకం వస్తోందిరా! కృష్ణ మూర్తీ!..."

"ఒరే శ్రీపతీ! ఒక చిన్నకథ విను" అన్నాడు కృష్ణ మూర్తి... "పూర్వం ఒక బౌద్ధాచార్యుడుండేవాడు. అతడు మాటిమాటికీ 'అహింసా పరమో ధర్మః' అనేవాడు. అతని దగ్గరకు ఒక పులి వచ్చింది. పంజాతో ముఖం మీద ఒక దెబ్బకొట్టింది. అతడు దానిని ఎదుర్కొనలేదు. పొడవలేదు. చంపలేదు. 'అహింసాపరమో ధర్మః' అన్నాడు శాంతంగా. మరోసారి అతన్ని తేలుకుట్టింది. మళ్ళీ కుట్టింది. తనివి దీరక మరొకమారు కుట్టింది. ఎన్ని సార్లు కుట్టినా బౌద్ధ భిక్షువు — 'లబో దిబో అహింసా పరమో ధర్మః' అన్నాడేగాని, ఆ తేలునేమీ చేయలేదు. మరొకరోజు అతను నిద్రపోతుంటే అతన్ని నల్లి కరిచింది. వెంటనే ఆ బౌద్ధభిక్షువు ఆ నల్లిని కాలరాచి, 'అహింసా పరమో ధర్మః' అన్న నినాదాన్ని అంతటితో వదలిపెట్టేశాడు. కనుక—నాయనా శ్రీపతీ! ప్రపంచంలో దేన్నయినా భరించవచ్చును గానీ- నల్లిబాధను మాత్రం భగవంతుడైనా భరించలేడు....

శివుడద్రిని వసియించుట,
రవిచంద్రులు మింటనుంట, రాజీవాక్షుం
డవిరళముగ శేషునిపై
బవళించుట నల్లిబాధ పడలేక సుమీ!

అని కవి వాక్యం!"

శ్రీపతి యిదేమీ వినేస్థితిలో లేడు. "నాయనా కృష్ణమూర్తీ! ప్రభువులు, నవాబులు, తమ ఆస్థానాల్లో వస్తాదుల్ని పెంచడం విన్నాను గానీ, నీలాగా నల్లుల్ని పెంచేవాళ్ళ నెక్కడా కనలేదు నేను. నువ్వు చిక్కిపోవ డానికిగల రెండవకారణమేమిటో తెలుస్తూనే వుంది. నీ శరీరం కాపాడుకోటానికి — వీటికేదైనా మందో మాకో పెట్టక పోయావా?..."

"నేను మాత్రం ఏం చెయ్యగలను శ్రీపతీ. మానవుడు ప్రపంచాన్ని ఒక్కే ఒకక్క నిమిషంలో సర్వనాశనం చేయగల సాధనాలు కనిపెట్టాడుగానీ, ఈ మత్కుణ సంహారానికి ఉపయోగపడగలసాధనాన్ని యింకాకనిపెట్టలేకపోతున్నాడు. ఏదైనా మందుచల్లితే అది వాటికి కేవలం సంజుడు పదార్థంగా ఉపయోగ పడుతోందేతప్ప ఫలితం శూన్యం. ఈ నల్లులు చాలా తెలివైన ప్రాణులు. గోడలనిండా మందు చల్లినా — ఎక్కడో ఒకచోట — మందు తగలని స్థానంలో సురక్షితంగా బైఠాయించి, మళ్ళీ క్రిందికి దిగబడతాయి. దూలాలపైన దాగి, మనుషులపైకి దూకుతాయి. మనిషి కదిలితే అరమైలు దూరం పరుగెడతాయి. ఆదమరిస్తే — కౌగిట్లో వుంటాయి. మానవుడు సాధించలేనిమహాకార్యాల్లో మత్కుణ వినాశనం ఒకటి! ..."

శ్రీపతికి శివరాత్రి జాగారం తప్పలేదు. తెల్లవారింది. తన మహారాజ్ఞికోసం కొందరు చెలికత్తెల్ని, అంటే నల్లుల్ని వెంటబెట్టుకొని వెంటనే అతడు బస్సెక్కాడు.

సంవత్సరం క్రితం తన రక్తదాన సన్నివేశం కళ్ళకు కట్టి నట్లయింది. అలెడు అనుకొన్న దొకటి; అయినది మరొకటి. తన సతీమణికి దూరంగా—ఒక్క రోజు హాయిగా గడపాలను కున్నాడు. తనసతీమణి చింతలేనికోరతను కల్లులుతీర్చాయి. ఆలిపోరుపడలేక బయలుదేరినవాడు నల్లిబాధపడలేక తిరోగ మిస్తున్నాడు. తన మగువకు, మత్కుణానికీ ఆకారాల్లోతప్ప మరి దేనిలోనూ భేదం కనుపించటం లేదు.

బస్సుదిగి, గేటుదాటి, యింటి ఆవరణలో కాలు మోపాడు శ్రీపతి. అతని జీవితేశ్వరి ధుమధుమలాడుతూ ఎదురైంది. "నిన్న సాయంకాలమే రమన్నానే—యిప్పుడా దిగబడ్డారు?.... బాగుంది?... ఎలా వుంది మీా స్నేహితు డికి?..."

"పాపం చాలా కాలం బ్రతుకుతాడన్న నమ్మకం లేదు!"

—೦—